
## షెడ్యూల్ విడుదలైన రోజు నుంచే కోడ్: జేసీ

**కలెక్టరేట్, మార్చి 14:** ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేవరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ తెలిపారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో విజయనగరం నియోజక వర్గస్థాయి ఎన్నికల అధికారులు, సిబ్బందికి బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల విధులు, కోడ్ అమలు తదితర అంశాలపై నిబంధనలను క్షుణ్ణంగా చదువుకోవాలని తెలిపారు. ఎంసీసీ బృందాలు ఎన్నికల ఫిర్యాదులపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రతి రోజు ఎంసీసీ అమలుపై నివేదికలను పంపాల్సి ఉంటుందని చెప్పారు.

# వీడని ఉత్కంఠ

- రెండో జాబితాలోనూ జిల్లాకు చోటు దక్కలే!
- విజయనగరం లోక్‌సభ సీటు పరిస్థితీ అంతే
- ఎస్.కోట, చీపురుపల్లిలో టికెట్లు ఎవరికో?
- ఎచ్చెర్ల నియోజకవర్గంపై ఎన్నో సందేహాలు



ఉత్కంఠకు తెర పడలేదు. చీపురుపల్లి, ఎస్.కోట, ఎచ్చెర్ల, విజయనగరం ఎంపీ అభ్యర్థిపై కూటమి తరఫున టిక్కెట్ ఆశావహులు, నాయకులు, కార్యకర్తల్లో టెన్షన్ నెలకొంది. ఏ సమయంలోనైనా ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశం ఉండడంతో రెండో జాబితాలో స్పష్టత వస్తుందని అందరూ ఎదురుచూశారు. కానీ గురువారం విడుదల చేసిన జాబితాలో ఏ స్థానంపైనా స్పష్టత రాలేదు. 34మందితో విడుదలైన జాబితాలో జిల్లా అభ్యర్థులకు చోటు దక్కలేదు. దీంతో అంతా నిరాశ చెందారు. సీటుపై స్పష్టత వస్తే ప్రజల్లోకి మరింత విస్తృతంగా వెళ్లాలని ఆయా అభ్యర్థులు భావిస్తున్నారు.

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)/ ఎస్.కోట

చీపురుపల్లి, ఎస్.కోట అభ్యర్థుల ఎంపికలో అధిష్టానం ఆచుతూచి అడుగులు వేస్తోంది. అలాగే విజయనగరం పార్లమెంట్ పరిధిలోని శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గ అభ్యర్థి ఎవరన్నది కూడా ప్రకటించలేదు. ఇక్కడ ఇన్‌చార్జిగా మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కిమిడి కళావెంకటరావు ఉన్నారు. పార్టీలో ఇతరుల పేర్లు, జనసేన, బీజేపీ అభ్యర్థుల పేర్లు ప్రచారంలోకి వస్తుండడంతో అందరి చూపు ఈ మూడింటిపైనే ఉంది. ఎస్.కోట నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి కోళ్ల లలితకుమారి టిక్కెట్టు ఆశిస్తున్నారు. ఇదే టిక్కెట్టు కోసం ఎన్ఆర్ఐ గొంప కృష్ణ కూడా ఆశావహునిగా ఉన్నారు. దీంతో అధిష్టానం ఒక నిర్ణయానికి రాలేకపోతున్నట్లు తెలుస్తోంది. ఎస్.కోట టిక్కెట్టు కోళ్లకే అని అందరూ ధీమాగా ఉండేవారు. ఈమె పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీ శాసన సభ్యునిగా, మాజీ మంత్రిగా వ్యవహరించిన కోళ్ల అప్పలనాయుడు వారసురాలిగా ఉండడంతో పాటు రెండుసార్లు ఎమ్మెల్యే అయ్యారు. నియోజకవర్గంలో తనకంటూ శాశ్వత గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఇక వేపాడ మండలానికి చెందిన గొంప కృష్ణ అమెరికాలో స్థిరపడ్డారు. తానాలో సభ్యుడుగా వున్నారు. 2022 డిసెంబర్ నుంచి నియోజకవర్గంలో పర్యటిస్తూ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. దీంతో అధిష్టానం ఇక్కడి అభ్యర్థిని కొలిక్కితేలేకపోతోంది. అధినేత ఏ నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. ఇక చీపురుపల్లి నియోజకవర్గం నుంచి ఇంతవరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జునే పోటీలో ఉంటారనేది అందరి మాట. నియోజకవర్గ ఇన్‌చార్జి కూడా ఆయనే కావడం.. తల్లి కిమిడి మృణాళిని గతంలో మంత్రిగా పనిచేయడం.. తండ్రి గణపతిరావు ఎమ్మెల్యేగా పనిచేయడం.. 2019 ఎన్నికల్లో నాగార్జునే టీడీపీ అభ్యర్థిగా పోటీ చేయడం.. తదితర కారణాలతో నాగార్జునే అభ్యర్థిగా అందరూ భావిస్తూ వస్తున్నారు. అయితే బొత్స సత్యనారాయణను ఢీ కొట్టాలంటే ఇంకా బలమైన అభ్యర్థి కావాలంటూ గంటా శ్రీనివాసరావును అధినేత తీసుకువస్తున్నట్లు ప్రచారం జరిగింది. ఏదైనాగాని రెండో జాబితాలో కూడా ఎవరి పేరూ ప్రకటించలేదు. మొదటి జాబితాలో సీట్లు ఖరారైన వారు ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రచార పర్వాన్ని ప్రారంభించారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరుతున్న వారిని ఆహ్వానిస్తూ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ముందుకు సాగుతున్నారు.

### ప్రచారంలో నిమగ్నం

విజయనగరం నుంచి అదితి గజపతిరాజు మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈమె నిరంతరం ప్రజల్లో ఉంటున్నారు. ప్రచారంలో తండ్రి కూడా బాసటగా నిలుస్తున్నారు. గజపతినగరం అభ్యర్థిగా యువకుడు, విద్యావంతుడైన కొండపల్లి శ్రీనివాసరావు రాజకీయ కుటుంబం నుంచి వచ్చినవారే. అధిష్టానం యువతకు ప్రాధాన్యం ఇచ్చే క్రమంలో కేఏనాయుడుకు కాకుండా శ్రీనివాసరావుకు టిక్కెట్ కేటాయించింది. బొబ్బిలి నియోజకవర్గ అభ్యర్థిగా ఆర్‌వీఎస్‌కేకే రంగారావు(బేబీనాయన)ను ఎంపిక చేశారు. ముందునుంచే ఈ అభ్యర్థిత్వం ఖరారుకానుందని సంకేతాలుండేవి. ఈయన కూడా రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన వారే. తాత ఆర్ఎస్ ఆర్‌కే రంగారావు మద్రాస్ ప్రెసిడెన్సీలో సీఎంగా పనిచేశారు. తండ్రి ఆర్‌వీజీకే రంగారావు ఎంపీగా పనిచేశారు. సోదరుడు సుజయ్ కృష్ణరంగారావు టీడీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. బేబీనాయనకు కూడా బొబ్బిలి మున్సిపల్ ఛైర్మన్‌గా పనిచేశారు. రాజాం నుంచి బరిలో ఉన్న మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ నియోజకవర్గంలోని వైసీపీ అసంతృప్తి నాయకులను టీడీపీలోకి ఆహ్వానిస్తూ పార్టీని పటిష్టం చేస్తున్నారు. నాలుగు మండలాల్లోనూ కేడర్ ఉంది. నెలిమర్ల నియోజకవర్గాన్ని పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించారు. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి లోకం నాగమాధవి రెండు పార్టీల మద్దతును కూడ గట్టుకుంటూ ముందుకు సాగుతున్నారు.

# ఏఎంసీల్లో నిస్తేజం



- తగ్గిన ఆదాయం
- కలిసిరాని ఈ-పర్మిట్ విధానం
- సిబ్బంది చేతివాటంపై విమర్శలు
- మరుగున పడిన పెట్రోల్ బంకుల ఏర్పాటు అంశం

వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. అభివృద్ధి లేదు. ఆదాయం పెరగడం లేదు. రైతులకు సేవలు అందివ్వడం లేదు. ఈ-పర్మిట్ విధానం ఫలితమివ్వడం లేదు. పైగా సిబ్బంది చేతివాటం చూపుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయాలని సమావేశాల్లో తీర్మానించినా ఈ అంశం మరుగున పడిపోయింది. వెరసి కొత్త ఆదాయ మార్గాలు కనిపించడం లేదు. ఈ ప్రభుత్వం వచ్చాక ఏ విషయంలోనూ అభివృద్ధి లేదు.

**రాజాం, మార్చి 14:**

జిల్లాల విభజన తర్వాత పార్వతీపురం, సాలూరు, కురుపాం కమిటీలు పార్వతీపురం మన్యం జిల్లాలో కలిసిపోయాయి. కొత్తగా రాజాం ఏఎంసీ చేరింది. మొత్తంగా విజయనగరం, బొబ్బిలి, గజపతినగరం, చీపురుపల్లి, పూసపాటిరేగ, కొత్తవలస, రాజాం ఏఎంసీలు ఉన్నాయి. అయితే గతంలో మాదిరిగా ఆదాయ వనరులు లేకుండా పోయాయి. ప్రస్తుతం ప్రధాన రహదాలపై చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయి. వాటి ద్వారా ఈ పర్మిట్ విధానంలో సెస్ వసూలు చేస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల రవాణా సమయంలో వాటి ధరలో ఒక శాతం సెస్‌ను వసూలు చేస్తారు. ఒక విధంగా చెప్పాలంటే ఏఎంసీలకు ఇదే ప్రధాన ఆదాయ వనరు. కానీ అక్కడున్న సిబ్బంది చేతవాటం ప్రదర్శిస్తున్నారన్న ఆరోపణలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. వ్యాపారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారన్న ఫిర్యాదు వెల్లువెత్తుతున్నాయి. వ్యాపారులు ఒకసారి అనుమతి పొంది.. రెండు, మూడు వాహనాల్లో అనుమతికి మించి ఉత్పత్తులను తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. గతంలో ఏఎంసీలు వసూలుచేసే సెస్ స్థానిక సంస్థలకు చెల్లించేవారు. ఏఎంసీ నిధులతో గ్రామాల్లో రోడ్లు, కాలువలు ఏర్పాటు చేసేవారు. సీజన్లవారీగా పశు వైద్య శిబిరాలు ఏర్పాటుచేసేవారు. ఏటా ఈ నిధుల కోసం స్థానిక సంస్థల ప్రతినిధులు ఏఎంసీ ఛైర్మన్లపై ఒత్తిడి తెచ్చేవారు. ప్రస్తుతం సెస్ ఆదాయం నేరుగా రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు జమవుతోంది. తిరిగి నిధులు మంజూరు కావడం లేదు.

### రెండేళ్లుగా గడ్డుకాలం

రెండేళ్ల కిందట కరోనా కారణంగా ఏఎంసీల ఆదాయానికి గండిపడింది. దీనికితోడు 2020లో కేంద్రం తీసుకొచ్చిన సాగు చట్టాల ఫలితంగా దేశంలో ఒకే మార్కెట్ విధానం తెరపైకి వచ్చింది. రైతులు దేశంలో ఎక్కడైనా తమ వ్యవసాయ ఉత్పత్తులను విక్రయించుకునేందుకు కేంద్రం అవకాశం కల్పించింది. దీని ఫలితంగా 2020 జూలైలో జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులు మూతపడ్డాయి. ఏఎంసీలకు గడ్డుకాలం ఎదురైంది. కనీసం సిబ్బందికి జీతాలు ఇచ్చుకోలేని స్థితికి కొన్ని చేరుకున్నాయి. ఈ పరిస్థితిలో ఆదాయ వనరులపై మార్కెటింగ్ శాఖ దృష్టిపెట్టింది. ఏఎంసీ ప్రాంగణాల్లో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. రాజాం, బొబ్బిలి, గజపతినగరంలో ముందుగా ప్రారంభించాలని తలపెట్టింది. స్థలాల ఎంపికా పూర్తయింది. అప్పట్లో ఆయిల్ కంపెనీల ప్రతినిధులు సైతం సుముఖత వ్యక్తం చేసినా ఏర్పాటు కాలేదు. ఈ ప్రభుత్వం కనీస సహకారం అందించలేదు.

### ఈ-పర్మిట్ ఇలా..

గత ఏడాది సెప్టెంబరు 1 నుంచి ఈ-పర్మిట్ విధానాన్ని మార్కెటింగ్ శాఖ అమలుచేసింది. వ్యవసాయ ఉత్పత్తుల క్రయ విక్రయాలకు సంబంధించి సెస్‌ను ఆన్‌లైన్‌లో వసూలు చేస్తోంది. ఇందుకోసం ప్రత్యేక వెబ్ పోర్టల్‌ను రూపొందించింది. వ్యాపారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వెంటనే యూజర్ ఐడీ వస్తోంది. అందులో వివరాలు పొందుపరచి నెట్ బ్యాంకింగ్ ద్వారానైనా, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా అయినా ముందుగా రుసుం చెల్లించవచ్చు. వెంటనే మార్కెటింగ్ శాఖ నుంచి వ్యాపారికి ఆన్‌లైన్‌లో అనుమతి లభిస్తుంది. ట్రాన్స్‌పోర్టు పర్మిషన్ ఐడీ వస్తుంది. దానిని సెల్‌ఫోన్ మెసేజ్ రూపంలో చెక్‌పోస్టులో చూపిస్తే అక్కడున్న సిబ్బంది వాహనానికి అనుమతిస్తారు. సులువైన విధానం అయినప్పటికీ ఈ-పర్మిట్‌ను కొంతమంది సిబ్బంది పక్కదారి పట్టిస్తున్నారు. వ్యాపారుల వద్ద నగదు తీసుకొని వాహనాలను విడిచిపెడుతున్నారు.

- రాజాం మార్కెట్ కమిటీ పరిస్థితి మరింత దయనీయం. ఈ-పర్మిట్ విధానం అమలుకు రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. స్థలం ఎంపిక ఇంకా కొలిక్కిరాలేదు.

### సేవలు మెరుగవుతాయి

వ్యవసాయ మార్కెట్ కమిటీల సేవలు మెరుగుపరచాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే ఈపర్మిట్ విధానం అమలు చేస్తున్నాం. గతంలో రాజాం ఏఎంసీ ప్రాంగణంలో పెట్రోల్ బంకు ఏర్పాటుకు స్థల పరిశీలన జరిగింది. ఈ విషయం ఉన్నతాధికారుల పరిధిలో ఉంది.

- శ్రీనివాసరావు, ఏఎంసీ కార్యదర్శి, రాజాం

## ఆర్‌వోల నియామకం

**కలెక్టరేట్, మార్చి 14:** ఎన్నికల దృష్ట్యా జిల్లాలోని విజయనగరం పార్లమెంట్‌కు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారుల(ఆర్‌వోలు)ను నియమించారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసింది. విజయనగరం పార్లమెంట్‌కు కలెక్టర్ నాగలక్ష్మి రిటర్నింగ్ అధికారిగా నియామకమయ్యారు. ఫోన్ నెంబరు 9490194666ను కేటాయించారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆర్‌వోలతోపాటు ఈఆర్‌వోలగా ఆయా మండల తహసీల్దార్లను నియమిస్తూ ఆదేశాలు వచ్చాయి.

| నియోజకవర్గం | రిటర్నింగ్ అధికారి | ఫోన్ నెంబర్ |
| --- | --- | --- |
| రాజాం | ఎల్.జోసఫ్ (ఎస్‌డీసీ, టీబీపీ యూనిట్-2 చీపురుపల్లి | 8333813462 |
| బొబ్బిలి | ఆదిమూలం సాయిశ్రీ (ఆర్‌డీవో, బొబ్బిలి) | 8333813256 |
| చీపురుపల్లి | వి.శాంతి (ఆర్‌డీవో చీపురుపల్లి) | 8333813275 |
| గజపతినగరం | ఎంవీ సూర్యకళ (ఆర్‌డీవో, విజయనగరం) | 9491012021 |
| నెల్లిమర్ల | ఎం.నూకరాజు( ఎఫ్ఎస్‌వో) | 9515129843 |
| విజయనగరం | కె.కార్తీక్ (జాయింట్ కలెక్టరు) | 9491012011 |
| ఎస్.కోట | పి.మురళీకృష్ణ (ఎస్‌డీసీ, భూసేకరణ యూనిట్ -3) | 7396832929 |

# వారిపై కాంగ్రెస్ కన్ను

- ఇతర పార్టీల అసంతృప్తులు, ఆశావాహులపై దృష్టి
- గుట్టుగా వివరాల సేకరణ
- రేపు పీసీసీ చీఫ్ జిల్లాకు రాక




**విజయనగరం(ఆంధ్రజ్యోతి), మార్చి 14:** తెలంగాణ, కర్ణాటక ఎన్నికల్లో విజయం సాధించి జోష్ మీదున్న కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్‌పై దృష్టిసారించింది. 175 సీట్లలోనూ పోటీచేయాలనుకుంటోంది. ఇందులో భాగంగా జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో అభ్యర్థులను దింపే దిశగా అడుగులు వేస్తోంది. అయితే గెలుపు గుర్రాలను వెతకడంలో భిన్న పంథాను అనుసరిస్తోంది. ఇతర పార్టీల నుంచి టిక్కెట్ ఆశించి భంగపడ్డవారు, పోటీచేయ్యాలనే ఆశావాహల వివరాలు సేకరించే పనిలో పడింది. వైసీపీలో కొన్ని చోట్ల కోల్డ్‌వార్ జరుగుతోంది. ఆ నియోజకవర్గంలో పోటీ చేసి ఓట్లు తెచ్చుకోగల నేతలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా ఎమ్మెల్సీ రఘురాజుకు ఫోన్ చేసి పార్టీలో చేరాలని, సముచిత స్థానం కల్పిస్తామని తెలిపినట్లు సమాచారం. ఇదే విధంగా నెల్లిమర్ల నియోజకవర్గంలో ఓ వైసీపీ నేత వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. ఇలా జిల్లాలో అసంతృప్తులు, ఆశావాహల వివరాలు తీసుకుని నేరుగా వారిని పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే జిల్లా నుంచి కాంగ్రెస్ నాయకులు పలువురు తమకు సీటు కేటాయించాలని విజయవాడలోని పీసీసీ కార్యాలయానికి దరఖాస్తు చేసుకున్నారు. 30 మంది వరకు నేరుగా దరఖాస్తులను పార్టీ పెద్దలకు అందించారు. వాటిని పరిశీలించిన పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల, మరి కొంతమంది పార్టీ పెద్దల దరఖాస్తులను ఏఐసీసీ కార్యాలయానికి పంపించినట్లు జిల్లాలో ఓ కాంగ్రెస్ నేత తెలిపారు. ఈ నెల 16న జరిగే గాజువాక సభ అనంతరం దరఖాస్తులు చేసుకున్నవారి వివరాలు, గెలుపుపై వారికున్న అవకాశాలు, తదితర విషయాలను వైఎస్ షర్మిల, రఘువీర, రుద్రరాజు జిల్లాకు వచ్చి పరిశీలించనున్నట్లు తెలిసింది.

## రెండు రోజులకే రోడ్డు శిథిలం



**బొబ్బిలి, మార్చి 14:** రాష్ట్రీయ రహదారిలో పారాది గ్రామం వద్ద వేగవతి నదిలో చేపట్టిన అప్రోచ్ రోడ్డు రెండు రోజులకే పాడైంది. ఇక్కడికి సమీపంలో ఉన్న వంతెన శిథిలావస్థకు చేరుకోవడంతో కొత్త బ్రిడ్జిని నిర్మించేందుకు అనువుగా నదిలో ఇటీవల అప్రోచ్ రోడ్డు వేశారు. ఈ రహదారి పనులు ఎంత నాణ్యతగా జరిగాయో ఇక్కడి పరిస్థితి చూసి చెప్పవచ్చు. ఇప్పటికే ఈ వంతెన దగ్గర తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడి ప్రయాణికులు అవస్థలు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి రోడ్డు నాణ్యతను పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# కేరింత



విజయనగరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష రాసి ఆనందంతో వస్తున్న విద్యార్థినులు



హమ్మయ్య.. పరీక్షలు అయిపోయాయి. కొద్దిరోజులు పుస్తకాలకు దూరంగా గడపొచ్చు.. నాన్నమ్మ, తాతయ్య దగ్గరకు వెళ్లవచ్చు. స్నేహితులతో సందడి చేయొచ్చు అంటూ ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులు ఒకరికొకరు చెప్పుకున్నారు. పరీక్ష కేంద్రం నుంచి గురువారం ఆనందంతో బయటకు వస్తూ కొద్దిసేపు స్నేహితులతో ముచ్చటించారు. పరీక్షలు అయిపోవడంతో గుండె మీదున్న బరువు దిగినట్లయిందనుకున్నారు. విక్టరీ గుర్తు చూపుతూ.. టాటా చెబుతూ ఇంటిబాట పట్టారు. - విజయనగరం

## విద్యార్థిని ఆత్మహత్య


జి.మానస (ఫైల్)

**బొబ్బిలి:** బొబ్బిలి మండలం అలజంగి గ్రామానికి చెందిన విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ చదలవాడ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు అలజంగికి చెందిన జి.మానస (16) స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకుంటోంది. గురువారం తెల్లవారుజామున తమ ఇంటి స్లాబ్‌కు గల ఇనుప కొక్కేనికి చీరతో ఉరి పోసుకొని మృతి చెందింది. బాలిక తాత చూసి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు చూసి కన్నీరుమున్నీరయ్యారు. పరీక్షలు దగ్గర పడుతుండడంతో టీవీ, సెల్ చూడవద్దని.. బాగా చదువుకోవాలని తల్లిదండ్రులు చెప్పడంతో మానస మనస్తాపంతో ఈ అఘాయిత్యానికి పాల్పడిందని భావిస్తున్నట్లు తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతదేహానికి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని... కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ చదలవాడ తెలిపారు. మృతురాలికి తండ్రి శంకరరావు, తల్లి, తమ్ముడు ఉన్నారు.

## దేవుపల్లిలో మరొకరు...

**బొండపల్లి:** దేవుపల్లిలోని యాదవ కాలనీకి చెందిన ఇంటర్ విద్యార్థిని కడుపు నొప్పితో బాధపడుతూ గురువారం వేకువజామున ఆత్మహత్య చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ కె.లక్ష్మణరావు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రాజాన రూప(20) గజపతినగరంలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. తండ్రి సూర్యనారాయణ మృతిచెందగా అమ్మమ్మ మురపాక సూరమ్మ సంరక్షణలో ఉంటూ చదువుకుంటోంది. కొద్ది నెలలుగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతోంది. గురువారం వేకువజామున కూడా కడుపునొప్పి రావడంతో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అమ్మమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం విజయనగరంలోని కేంద్ర సర్వజన ఆసుపత్రికి తరలించారు.

## ట్రాక్టర్ బోల్తా.. ముగ్గురికి గాయాలు

**కురుపాం రూరల్:** ఇటుకల లోడుతో కురుపాం వస్తున్న ట్రాక్టర్ కస్పాగదబవలస గ్రామం వద్ద బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కూలీలు జి.గోపయ్య, కె.పోసయ్య, ఎం.సింహాచలంకు గాయాలయ్యాయి. కూలీలు అంతా వీరఘట్టం మండలం నడిమికెల్ల గ్రామానికి చెందినవారు. గాయపడిన వారికి కురుపాం ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం తరలించారు. కురుపాం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## బెల్లం ఊటల ధ్వంసం

**వంగర:** వీవీఆర్ పేటలో గురువారం సాయంత్రం ట్రైనీ డీఎస్పీ మహేంద్ర తన సిబ్బందితో దాడులు నిర్వహించి 2,600 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేశారు. 30 లీటర్ల నాటు సారా గుర్తించినట్లు డీఎస్పీ తెలిపారు. ఈ దాడుల్లో రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనువాసరరావు, ఎస్ఐ జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

## రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

**దాసన్నపేట:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.జగన్మోహన్‌రావు పిలుపునిచ్చారు. గురువారం కోట జంక్షన్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రాము, రమణ, త్రినాథ్, కనకమహాలక్ష్మి, రాకోటి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు జాతీయ లోక్‌అదాలత్

**శృంగవరపుకోట:** శృంగవరపుకోట కోర్టులో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.వాణి తెలిపారు. రాజీ కాగలిగిన సివిల్, క్రిమినల్, చెక్‌బౌన్స్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు.

## ఉపాధి వేతనదారులకు సామగ్రి పంపిణీ

**బాడంగి:** పిండ్రంగివలస గ్రామంలో గురువారం రౌతు సురేష్ తల్లిదండ్రులైన మాజీ సర్పంచ్ రౌతు లక్ష్మంనాయుడు, సింహాచలమ్మల జ్ఞాపకార్థం జనసేన బొబ్బిలి ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి చేతులమీదుగా ఉపాధి వేతనదారులకు సామగ్రి పంపిణీ చేశారు. జనసేన ఇన్‌చార్జి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయానికి రూ.10వేలు విరాళంగా అందజేశారు. జనసేన మండల వైస్ ప్రెసిడెంట్ గంట్రెడ్డి శ్రీనివాసరావు, రామకృష్ణ, రౌతు సింహాచలం, కృష్ణ, తాడ్డి రాము, బుసర సత్యనారాయణ, గన్నేద సత్యనారాయణ, కొత్తల నారాయణరావు పాల్గొన్నారు.

## నేడు ఉచిత వైద్య శిబిరం

**లక్కవరపుకోట (కొత్తవలస):** స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు బార్ అసోసియేషన్ కార్యదర్శి గిరిబాబు తెలిపారు. మెడికవర్ ఆసుపత్రి సహకారంతో బార్ అసోసియేషన్, రామదండు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. న్యాయవాదుల కుటుంబాలు, కోర్టు సిబ్బంది కుటుంబాలు, కక్షిదారులు, అర్జీదారుల కుటుంబాలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## కంటి వ్యాధులపై అవగాహన

**లక్కవరపుకోట (కొత్తవలస):** వియ్యంపేటలో గల అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో గురువారం కంటి వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ టి.జయశ్రీ ఆధ్వర్యంలో వైద్యుడు ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు విద్యార్థులకు కంటి సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## ముగిసిన టెక్నికల్ సింపోజియం

**విజయనగరం రూరల్ :** నగర శివారులోని జేఎన్టీయూ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోజియం ప్రతీక్ష 2క-2024 కార్యక్రమం గురువారం ముగిసింది. ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ జయసుమ మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ సునీల్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి శ్రీనివాస్ ప్రసాద్, బాలమురళీకృష్ణ, ఫణీంద్రనాథ్‌తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల కవాతు

**బాడంగి:** రానున్న ఎన్నికలు సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బొబ్బిలి రూరల్ సీఐ ఎస్.తిరుమలరావు కోరారు. ఈ మేరకు గురువారం పినపెంకి, వాడాడ గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.జయంతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తర్వులు అమలు చేయాలి

**లక్కవరపుకోట:** మండలంలోని 7 పంచాయతీలకు సంబంధించిన గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవోలుగా అధికారం ఇస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. సంబంధిత ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని కోరుతూ గురువారం ఎంపీడీవో కె.రూపేష్‌కు ఏడుగురు కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. రంగాపురం, పోతంపేట, లింగంపేట, సంతపేట, గేదెలవానిపాలెం, తలారి శ్రీరాంపురం పంచాయతీల కార్యదర్శులకు డీడీవోలుగా నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## ఎవరికి టిక్కెట్ ఇచ్చినా పనిచేస్తాం

**శృంగవరపుకోట:** శృంగవరపుకోట నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు తెలుగుదేశం పార్టీ ఎవరికి టిక్కెట్‌ను కేటాయించినా గెలుపు కోసం పనిచేస్తామని ఎంపీపీ సండి సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, సర్పంచ్ గనివాడ సంతోషి కుమారిలు తెలిపారు. గురువారం వీరు విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వైసీపీ నుంచి వీరు టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యే టిక్కెట్ కోసం మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఎన్ఆర్ఐ గొంప కృష్ణలు పోటీ పడుతుండడంతో వారు ఈమేరకు స్పష్టత ఇచ్చారు.

## ఆరోగ్యవంతమైన ప్రజాస్వామ్యం కోసమే ఓటు

**విజయనగరం:** ఆరోగ్యవంతమైన ప్రజాస్వామ్యం కోసం ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎమ్‌వీజీఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ పీఎస్ సీతారామరాజు పిలుపునిచ్చారు. ఎమ్‌విజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు ఓటు హక్కుపై గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమర్థవంతమైన నాయకులను ఎన్నుకునేందుకు ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్.మోహన్ కుమార్, ఎమ్.అనీల్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## నేత్ర పరీక్షలు తప్పనిసరి

**రాజాం రూరల్:** ప్రతిఒక్కరూ రెండేళ్లకోసారి నేత్ర పరీక్షలు చేయించుకోవడం ద్వారా గ్లకోమా వ్యాధి ద్వారా సంభవించే అంధత్వం నుంచి బయటపడవచ్చని ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు స్పష్టం చేశారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని మదర్‌థెరీసా నర్సింగ్ కాలేజీలో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నేత్ర వైద్యనిపుణుల సలహాలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధికి చిరునామా టీడీపీ


పార్టీలో చేరిన వారితో అదితి గజపతి తదితరులు

**విజయనగరం (ఆంధ్రజ్యోతి):** అభివృద్ధిలో దేశానికి తలమానికం తెలుగుదేశం ప్రభుత్వమని... పేదవాడు ఆత్మగౌరవంగా బతకాలన్నదే ఎన్టీఆర్ ఆశయని టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు అన్నారు. గురువారం నగరంలోని 1, 14వ డివిజన్‌లకు చెందిన సుమారు 80 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరిలో 18వ డివిజన్ కార్పొరేటర్ మీసాల రమాదేవి తల్లిదండ్రులు కూడా అదితి నాయకత్వాన్ని బలపరిచారు. ఈ సందర్భంగా అదితి మాట్లాడుతూ టీడీపీలో అశోక్ గజపతిరాజు సుదీర్ఘ కాలంగా ఉన్నారని... పేదవారు ఆత్మగౌరవంతో బతకాలని... పక్కాఇళ్లు వారికి ఉండాలన్నదే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. తెలుగుదేశంలో ప్రతిఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని చెప్పారు. కార్యకర్తలంతా నారా చంద్రబాబునాయుడుని అధికారంలోకి తీసుకొచ్చే దిశగా పనిచెయ్యాలని పిలుపునిచ్చారు. అవనాపు విజయ్ మాట్లాడుతూ నగరంలో వైసీపీకి ఇవే చివరి ఎన్నికలని, భవిష్యత్ అంతా టీడీపీదేనన్నారు. కాళ్ల గౌరీఈశంకర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిపై నగర ప్రజలు విరక్తి చెందారని... అందుకే వందలాది కుటుంబాలు టీడీపీని గెలిపించేందుకు పార్టీలో చేరుతున్నాయన్నారు. తెలుగుదేశం పార్టీలోకి వచ్చిన వారిని అదితి గజపతి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఐవీపీ రాజు, పిళ్లా విజయ్‌కుమార్, నగర మాజీ యువత అధ్యక్షుడు కర్రోతు నర్సింగరావు, పతివాడ రాము, పతివాడ పార్వతి, ఆవాల అప్పలస్వామి, రోహిణి కుమార్ తదితరులు స్వాగతించారు.

### వైసీపీ భూస్థాపితం కావడం ఖాయం..

**రాజాం:** త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైసీపీ భూస్థాపితం కావడం ఖాయమని నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. అరసాడ గ్రామానికి చెందిన పలు కుటుంబాలు గురువారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరాయి. వారికి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం కోండ్రు


పార్టీలో చేరిన వారితో కోండ్రు మురళీమోహన్

మురళీమోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో యువతకు ఉద్యోగాలు లేక ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిన్నింటి మెహన్‌రావు, లచ్చుభక్త కృష్ణమూర్తి, మజ్జి వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు. వైసీపీ నుంచి రాయిపల్లి అప్పలనాయుడు, రాయిపల్లి రమణ, గౌరీనాయుడు, కడగల జగన్నాథం, ఇప్పిలి వెంకటేష్, గంగులు, కాంబోతుల అప్పలనాయుడు, నారాయణరావు తదితరులు ఉన్నారు. ఇదిలా ఉండగా రాజాం పురపాలక సంఘ పరిధిలోని ఆరో వార్డులో కోండ్రు మురళీమోహన్ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సారధి రోడ్డులోని దివ్యాంగుల పాఠశాలలో విద్యార్థులకు కేక్ పంచిపెట్టారు. కార్యక్రమంలో నంది సూర్యప్రకాష్‌రావు, వంగా వెంకటరావు, అడపా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబును సీఎంగా చేయడమే లక్ష్యం

- చిన్నయ్యపేటలో 50 కుటుంబాలు టీడీపీలో చేరిక


చిన్నయ్యపేటలో టీడీపీలో చేరిన వారితో మాజీ మంత్రి కోండ్రు

**రేగిడి :** రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనకు చరమగీతం పాడి...మళ్లీ చంద్రబాబును సీఎంను చేయడమే లక్ష్యం కావాలని మాజీ మంత్రి కొండ్రు మురళీమోహనరావు సూచించారు. చిన్నయ్యపేటలో సీతమ్మ తల్లి ఆలయ సంబరాల్లో గురువారం కోండ్రు పాల్గొన్నారు. అనంతరం వైసీపీకి చెందిన కోట కంచంనాయుడు, కొమరాపు పండు సూర్యారావు, శింగిపురపు లక్షుంనాయుడు, శింగిపురపు చిన్నసత్యనారాయణ తదితర 50 కుటంబాలు కోండ్రు సమక్షంలో టీడీపీలో చేరినట్లు ప్రకటించారు. గ్రామంలో టీడీపీ కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నేతలు దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు, గురవాన రమేష్, గేదల బాలమురళీధర్, మాజీ జెడ్‌పీటీసీ మంతిన ఉషారాణి, గురువాన ధనంజయ్, సంకిలికి చెందిన కర్రి రమణ, నారు జనార్దనరావు, రాజాం, చిన్నయ్యపేట టీడీపీ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 80 ఏళ్ల వృద్ధురాలు సవిరిగాన వరహాలమ్మ... కోండ్రు విజయం సాధించాలని ఆశీర్వదించడం ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా..ఉంగరాడమెట్ట సెంటర్‌లో గురువారం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభించారు. టీడీపీ అభ్యర్థి కొండ్రు మురళీమోహనరావు స్థానిక క్యాడర్‌తో కలిసి రిబ్బన్ కట్ చేసి పార్టీ కార్యాలయం ప్రారంభించారు.


ర్యాలీ నిర్వహిస్తున్న టీడీపీ-జనసేన నేతలు, కార్యకర్తలు

### అరాచక పాలనకు స్వస్తి పలకండి

**లక్కవరపుకోట (కొత్తవలస):** రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనకు స్వస్తి చెప్పాల్సిన రోజు వచ్చిందని ఎస్.కోట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోళ్ల లలిత కుమారి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో జనసేన 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని నియోజకవర్గ సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోళ్ల..సీఎం జగన్‌పై మండిపడ్డారు. రాష్ట్ర భవిష్యత్, ప్రజా అవసరాల కోసం కూటమి ఏర్పడిన విషయాన్ని ఆమె ప్రజలకు వివరించారు. ఇరు పార్టీల జెండాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉచిత వైద శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్.చినరాము, ఇర్ర వెంకటలక్ష్మి, కుమారి, జన సైనికులు పాల్గొన్నారు.

### కార్యకర్తలను కాపాడుకుంటా..

**జామి:** పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పల కాపాడుకుంటానని టీడీపీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని టీడీపీ కార్యకర్త ఎన్నింటి అప్పలరాజు తల్లి చనిపోవడంతో.. ఆ కుటుంబాన్ని గురువారం పరామర్శించారు. అనంతరం కార్యకర్తలు, ముఖ్య నాయకులతో మాట్లాడుతూ ఎవరికి ఎటువంటి ఇబ్బందులు వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జామి, గజపతినగరం మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి శ్రీనివాస్

## నీరు.. రోడ్లు.. లేవు!

- టిడ్కో ఇళ్లలో దిగిపోండి
- తాళాలు అప్పగించేస్తాం..
- మున్సిపల్ చైర్మన్ సూచన
- తిరస్కరించిన లబ్ధిదారులు

**బొబ్బిలి:** 'టిడ్కో సముదాయంలో 144 ఇళ్లు నూరుశాతం పూర్తయ్యాయి. రోడ్లు, నీరు మాత్రమే లేవు. ఆ ఇళ్లలో దిగిపోతే తాళాలు అప్పగించేస్తామ'ని మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీకృష్ణారావు, వైసీపీ నాయకులు, కమిషనర్ లాలం రామలక్ష్మి లబ్ధిదారులకు తెలిపారు. అన్ని వసతులు కల్పించిన తరువాతనే అప్పగించాలంటూ వారు తిరస్కరిచండంతో వైసీపీ నాయకులు, అధికారులు కంగుతిన్నారు. 'ఇళ్లను పూర్తి చేయడానికి ఇన్నేళ్లు టైమ్ చాలలేదా? ఎన్నికల ముందు మీకు గుర్తుకొచ్చాయా? మాకు ఇళ్లను అప్పగించకుండానే బ్యాంకుల నుంచి అప్పులు చెల్లించాలని నోటీసులు వచ్చేస్తున్నాయి' అంటూ మహిళా లబ్ధిదారులు ప్రశ్నించడం వైసీపీ నాయకులకు మింగుడు పడలేదు. వివరాలివీ... స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టిడ్కో లబ్ధిదారులతో కమిషనర్ లాలం రామలక్ష్మి గురువారం సమావేశం నిర్వహించారు. మొత్తం 1248 ప్లాట్లకు గాను 144 ఇళ్లు (డబుల్ బెడ్‌రూమ్) నూరు శాతం పూర్తయిపోయాయన్నారు. రోడ్లు, నీటి సదుపాయం తప్ప నిర్మాణ ప్రక్రియ దాదాపు పూర్తయిందని, అందరికీ సమ్మతమైతే తాళాలు అప్పగిస్తామని చెప్పారు. దశలవారీగా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని అన్నారు. దీనికి ఎవరూ అంగీకరించలేదు. మర్రి నరేష్ రెడ్డి పద్మ, చిప్పాడ పద్మ, రమేష్ తదితరులు మాట్లాడుతూ నాయకులు, అధికారుల ప్రతిపాదనను తిరస్కరించారు. చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణారావు మాట్లాడుతూ పది శాతమే పనులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ చోడిగంజి రమేష్‌నాయుడు, జేఈలు స్వాతి, నవీన్, కాంతారావు, వైస్‌చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, గొలగాని రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

**శృంగవరపుకోట రూరల్:** ధర్మవరం గ్రామానికి చెందిన మోదే హర్ష తన తండ్రి రామునాయుడు జ్ఞాపకార్థం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు పరీక్షల సామాగ్రి అందించారు. 8, 9, 10 విద్యార్థులకు జామెట్రీ బాక్సులను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఉమమహేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పట్టణంలో బైకు ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం

**బొబ్బిలి:** జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం బొబ్బిలి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జనసైనికులు, వీరమహిళలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం కేక్‌ను కట్ చేశారు. ఆయనకు పార్టీ నాయకులు కేక్ తినిపించారు. గిరడ మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్ కల్యాణ్ నాయకత్వంలో ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీని ఇంటికి పంపించడం ఖాయమని అన్నారు. టీడీపీ- జనసేన కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. అనంతరం పార్టీ నాయకులు పెద్దింటి మనోజ్‌కుమార్ (బాబీ), లంక రమేష్‌ల ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. వీరమహిళలకు చీరలు, మొక్కలు పంపిణీ చేశారు. వీరమహిళ నాయకురాలు బంటుపల్లి దివ్య, రామభద్రపురం మండల పార్టీ అధ్యక్షుడు భవిరెడ్డి మహేశ్, ఫైలా హరిప్రసాద్, చిక్కాల సందీప్, ఉల్లి సంతోష్, అల్లు రమేష్, సూర్య నారాయణ, జమ్ము గణేశ్ పాల్గొన్నారు.

## గోస్తనీ కేంద్రంగా ఇసుక దోపిడీ


అంబదాసుపాలెం వద్ద ఇసుక ట్రాక్టర్

**శృంగవరపుకోట రూరల్:** బొడ్డవరలో ఒక అధికార పార్టీ చోటా నేత అనుచరులుగా చెప్పుకుంటూ కొందరు ఇసుక దోపిడీకి తెరలేపారు. బహిరంగంగా ఇసుకను తరలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... అల్లూరి సీతారామ రాజు జిల్లా చిలకలగెడ్డ, విజయనగరం జిల్లా బొడ్డవరను ఆనుకొని గోస్తనీ నది ప్రవహిస్తోంది. ఈ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు అధికార పార్టీ చోటా నేతల అండ తమకు ఉందని అక్రమాలకు తెర తీస్తున్నారు. ఐతన్నపాలెం కేంద్రంగా ట్రాక్టర్లతో పట్టపగలు ఇసుక రవాణా చేస్తున్నారు. అధికారులు వీరి వైపు కన్నెత్తి చూసే సాహసం చేయకపోవడంతో రోజుకు 15 ట్రాక్టర్ల వరకు ఇసుకను వివిధ ప్రాంతాలకు తరలిస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారు. గురువారం ఈ ఇసుక తరలింపు దృశ్యాలు 'ఆంధ్రజ్యోతి' ఫొటోలు తీయగా... ఐతన్నపాలెం గ్రామానికి చెందిన రాజుగారిదని ట్రాక్టర్ డ్రైవర్ చెప్పడం విశేషం. అదే సమయంలో సదరు రాజు వచ్చి 'మనల్ని ఎవ్వడూ ఏం చేయలేడు... పద' అంటూ ఇసుకను లోడ్ చేయించి తన ట్రాక్టర్‌ను వెంట తీసుకెళ్లిపోవడం గమనార్హం.

## సీఎం పదవికి జగన్ అనర్హుడు

- మాజీ మంత్రి కోండ్రు

**రేగిడి/రాజాం:** ఏపీపీఎస్సీ ఉద్యోగాలను వైసీపీ సర్కారు అమ్ముకొని రూ.150 కోట్లు స్కామ్‌కు పాల్పడ్డారని ఆరోపిస్తూ మాజీ మంత్రి కోండ్రు మురళీమోహనరావు, తన అనుచరులు రోడ్డెక్కారు. సీఎం పదవికి జగన్ మోహన్‌రెడ్డి అనర్హుడు అంటూ మండలంలోని ఉంగరాడ మెట్ట కూడలి, రాజాంలోని పార్టీ కార్యాలయం వద్ద గురువారం ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో వైసీపీ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. గ్రూప్ 1 నోటిఫికేషన్ మరోసారి ఇచ్చి..ఉద్యోగాలు భర్తీ చేయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడాన్ని బట్టి ప్రభుత్వ అవినీతి బయట పడిందని ఆయన ఆరోపించారు. ఒక్కొక్క పోస్టును రూ.కోట్లకు అమ్ముకొన్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంలో రూ.150 కోట్లు చేతులు మారాయని... ఇందులో ప్రభుత్వ పెద్దలే తిమింగలాలుగా ఉన్నారని నిప్పులు చెరిగారు. ఈ నిరసనలో రాజాం నియోజకవర్గ నేతలు గురవాన నారాయణరావు, దూబ ధర్మారావు, కిమిడి అశోక్‌కుమార్, మజ్జి శ్రీనివాసరావు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.


సీఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కోండ్రు మురళీమోహన్

### హైకోర్టు తీర్పు చెంపపెట్టు..

**విజయనగరం రూరల్:** ఏపీపీఎస్సీని భ్రష్టుపట్టించిన సీఎం జగన్‌కు హైకోర్టు ఇచ్చిన తీర్పు చెంప పెట్టని టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి గవర భరత్ విమర్శించారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గురువారం నగరంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ నిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం నిండా ముంచిందన్నారు. ఆ పార్టీని ఇంటికి పంపించే రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ నాయకులు గెదెల సతీష్, షైలపల్లి వాసు, టీకేఎల్ రాజు, కాళ్ల గౌరి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## కార్ల్‌మార్క్స్ వర్ధంతి

**శృంగవరపుకోట:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో గురువారం కార్ల్‌మార్క్స్ వర్ధంతిని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరావు, అధ్యాపకులు ప్రసాదరావు, షేక్ వలీఖాన్, శ్రీలక్ష్మి, బాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## బాలికావలసలో రక్త నమూనాల సేకరణ

**రేగిడి:** బాలికావలసలో రాజాం జీసీఎఫ్ఆర్ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవా విభాగం ఆధ్వర్యంలో ఆరో రోజు గురువారం రక్తనమూనాల గుర్తింపు (బ్లడ్ గ్రూపింగ్) శిబిరం నిర్వహించారు. రాజాం రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు కొత్త సాయి ప్రసాద్, పెంకి చైతన్యకుమార్‌లు ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థినులకు పరీక్ష సామగ్రి పంపిణీ

**రేగిడి:** దేవుదళ కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్న 44మంది విద్యార్థినులకు సంకిలి ఇఐడీఈప్యారీ షుగర్స్ బాసటగా నిలిచింది. వారికి అవసరమైన ప్లాంక్, ఇతర సామగ్రిని సుగర్ ఫ్యాక్టరీ ప్లాంట్ హెడ్ ఏవీపీ పట్టాభిరామిరెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ వి.మురళీకృష్ణ, డీజీఎం కేన్ రాజేంద్రన్, ప్రిన్స్‌పాల్ ఎం. లక్ష్మి వీటిని విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీటీసీ ప్రతినిధులు గవరయ్య, శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా బంగారమ్మ పండుగ

**లక్కవరపుకోట:** ఎల్.కోటలో గురువారం బంగారమ్మ పండగను గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం బంగారమ్మ భక్తులు ప్రభ, ఘటాలతో ఊరేగింపు నిర్వహించారు. అయిదేళ్లకు ఒకసారి జరిగే పండగ కావడంతో ప్రజలు వేల సంఖ్యలో హాజరయ్యారు.

## రెండు పూటలా పనిచేయాలి

**రామభద్రపురం:** ఉపాధి హామీ పథకం కూలీలు రెండు పూటలా పనిచేసి గరిష్ట వేతనం రూ.272కు చేరుకోవాలని ఏపీవో జి.త్రినాథరావు కోరారు. ఎస్.చింతలవలస గ్రామంలో ఉపాధి పనులను గురువారం ఆయన పరిశీలించారు. కొలతలు పూర్తిచేసే విధంగా పనులు చేపట్టాలన్నారు. ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 6 గంటల వరకు విధిగా పనులు చేయాలన్నారు. అనంతరం మస్తర్లు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీఏ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ఉచిత వైద్యశిబిరం

**బొబ్బిలి:** నారాయణప్పవలస-కాశిందొరవలస జంట గ్రామ పంచాయితీలలో ఇందిరాగాంధీ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నిర్వహిస్తున్న సేవాశిబిరంలో భాగంగా గురువారం వైద్యశిబిరం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బలగ అప్పలనాయుడు, పీఓలు పి.రామకృష్ణ, వై.సత్యనారాయణ, ఏఎన్ఎం బంగారమ్మ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## అంగన్వాడీల ర్యాలీ

**బొబ్బిలి:** బొబ్బిలి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి జె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం పోషణ్ పఖ్వాడా పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాజెక్టు పరిధిలో గల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్స్‌తో ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాలామణి, అరుణకుమారి, కృష్ణవేణి పాల్గొన్నారు.

## అక్రమ బదిలీలను నిలుపుదల చేయాలి

**బొబ్బిలి:** కౌన్సెలింగ్ విధానానికి నిలువునా తూట్లు పొడుస్తూ అక్రమంగా చేపట్టిన ఉపాధ్యాయ బదిలీలను వెంటనే నిలుపుదల చేయాలని ఏపీటీఎఫ్ అకడమిక్ రాష్ట్ర కన్వీనరు జేసీ రాజు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సుమారు 1400 మంది ఉపాధ్యాయులకు నగదు, సిఫారసు బదిలీలు చేసి ప్రభుత్వం అనైతికచర్యలకు పాల్పడిందని ఆరోపించారు. దీనిని ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు బంకురు జోగినాయుడు, సీహెచ్‌జే ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## గుడ్ టచ్.. బ్యాడ్ టచ్‌పై అవగాహన

**తెర్లాం:** ఎన్.బూర్జవలస ఎంపీపీ పాఠశాలలో గుడ్ టచ్... బ్యాడ్ టచ్‌లపై మహిళా పోలీసు శివదుర్గ అవగాహన కల్పించారు. విద్యార్థినులు వీటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి జాగ్రత్తగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.

## మగ్గం వర్క్‌పై శిక్షణ

**రాజాం:** మిలియం మేయర్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం నుంచి 35 మంది సొసైటీ సభ్యులకు మగ్గం వర్క్‌లో శిక్షణ ఇస్తున్నట్టు జీఎంఆర్ వైరెడ్ డైరెక్టర్ ఎం.రాజేష్ తెలిపారు. గురువారం శిక్షణకు ఎంపికైన వారికి అనుమతి పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ మేనేజరు వి.నాగరాజు. సొసైటీ డైరెక్టర్ సిస్టర్ హెల్మా హిల్డా ఎడ్యుకేషన్ డైరెకట్టర్ రాంబాబు పాల్గొన్నారు.

## సూర్యనారాయణ మృతి తీరని లోటు

**జామి:** మండల టీడీపీ ఉపాధ్యక్షుడు చుక్క సూర్యనారాయణ మాస్టారు మృతి పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. గురువారం ఉదయం గుండెపోటుతో మృతిచెందిన మాస్టారు మృతదేహం వద్ద లలితకుమారి నివాళులు అర్పించి... కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు, మండల పార్టీ కార్యదర్శి రమణ, శంకర్ పాల్గొన్నారు.

# రాష్ట్ర భవిష్యత్తు కోసమే పొత్తు

- గజపతినగరం, నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థులు కొండపల్లి శ్రీనివాస్, లోకం మాధవి
- ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం



దత్తిరాజేరు: మాట్లాడుతున్న శ్రీనివాస్



డెంకాడ: ప్రసంగిస్తున్న లోకం మాధవి

**దత్తిరాజేరు:** రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జరగబోయే సార్వత్రి క ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా పోటీ చేయనుందని గజపతి నగరం నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఎస్.బూర్జవలసలో గురువారం జరిగిన జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకా లను ప్రచారం చేయాలని కోరారు. అనంతరం మాజీ మంత్రి, జనసేన నాయ కురాలు పడాల అరుణ మాట్లాడుతూ కలిసికట్టుగా శ్రీనివాస్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చప్ప అప్పారావు, ప్రధాన కార్యదర్శి మిర్తిరెడ్డి ఈశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జిలు బెజవాడ బంగారునాయు డు, మజ్జి మహేష్, సీనియర్ నాయకులు గుసిడి జగన్నాథం, చెల్లూరి సత్యారా వు తదితరులు పాల్గొన్నారు. ● **డెంకాడ:** రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసమే జనసేన, టీడీపీ, బీజేపీ పార్టీల పొత్తు పెట్టుకున్నాయని నెల్లిమర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి లోకం మాధవి అన్నారు. మండల కేంద్రంలో గురు వారం జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆమె మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రతిఒక్కరికీ చేరవేస్తామ న్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నేతలు పాలవలస యశస్విని, పడాల అరుణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఆదరణ లభిస్తోంది

**గంట్యాడ:** టీడీపీ ఎంతో నమ్మకంతో టికెట్ ఇచ్చిందని, అదే నమ్మకంతో నియోజకవర్గంలో అందరినీ కలుపుకుంటూ ముందుకు వెళ్తామని ఎమ్మెల్యే అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గంట్యాడ గ్రామంలో గురువారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీలను ప్రజలు చక్కగా ఆదరిస్తున్నారని, వైసీపీపై ప్రజలు పూర్తిగా వ్యతిరే కంగా ఉన్నారని చెప్పారు. మాజీ మంత్రి పడాల అరుణ మాట్లాడుతూ శ్రీనివాస్ గెలుపు కోసం పూర్తి స్థాయిలో పని చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి మర్రాపు సురేష్ మాట్లాడుతూ నియోజ వర్గంలో వైసీపీ ఆగడాలను అరికట్టాలంటే టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండపల్లి కొండల రావు, మాజీ వైస్ ఎంపీపీ రంధి రామునాయుడు, జనసేన నాయకులు మిడత న రవికుమార్, ఆదాడ మోహనరావు, విమల రాణి, సారాధి అప్పలరాజు, బీజే పీ నాయకులు దేవర ఈశ్వరరావు, శ్రీధర్ పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

- అదనపు ఎస్పీ అస్మాఫర్హీన్



కెంగువ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ

**గజపతినగరం:** త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణం లో జరిగే విధంగా చర్యలు తీసుకుంటున్నా మని అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల తో పాటు మండలంలోని రామన్నపేట, లోగి స, కెంగువ గ్రామాల్లోగల పోలింగ్ కేంద్రా లను ఆమె గురువారం పరిశీలించారు. ఈసం దర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల పరిశీలనతో పాటు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచిస్తున్నామని చెప్పారు. గ్రామాల్లో ఎక్కడా అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చట్టపరమైన చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పా టు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ మహేష్ పాల్గొన్నారు.

## జీతాలు చెల్లించకపోతే నీటి సరఫరా నిలిపేస్తాం




నినాదాలు చేస్తున్న పంప్ హౌస్ కార్మికులు

**నెల్లిమర్ల:** ఎనిమిది నెలల కాలంగా బకాయిపడిన తమ జీతాలను సోమవారంలోగా చెల్లించకపోతే మంగళవారం అర్ధరాత్రి నుంచి మంచినీటి సర ఫరా నిలిపివేస్తామని రామతీర్థం, ముషిడిపల్లి పంప్ హౌస్ కార్మికుల యూని యన్ నాయకులు ఎ.జగన్మోహనరావు, మురళి, అరుణ స్పష్టం చేశారు. స్థానిక పంప్ హౌస్ వద్ద గురువారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. తప్పని సరి పరిస్థితుల్లో తాము ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. శుక్రవారం నల్ల రిబ్బన్లతో విధులకు హాజరవుతామని, శనివారం మేయర్, ప్రజాప్రతినిధులను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని, సోమవారం విజయనగరం మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నాచేస్తామని వివరించారు. అప్పటికీ జీతాలు చెల్లించక పోతే మంగళవారం అర్ధరాత్రి నుంచి మంచి నీటి సరఫరా నిలుపుదల చేస్తా మని స్పష్టంచేశారు. ప్రజలకు జరిగే అసౌకర్యానికి ప్రభుత్వమే బాధ్యత వహిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణరావు, రాంబాబు, రమేష్, శ్రీను, కృష్ణ, గోవింద్, స్వామి, సత్యనారాయణ, బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పూర్తికాకుండానే ప్రారంభోత్సవం

**వంగర:** రుషింగి- కిమ్మి వంతెనను హడావిడి మధ్య మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. ఎన్నికల షెడ్యూల్ ఏ రోజైనా వచ్చే అవకాశం ఉందన్న అభిప్రాయంతో వంతెన పనులు పూర్తికాకుండానే ప్రారం భించారు. చివరికి బిల్లు మంజూరు కాలేదన్న కారణంతో వంతెనను నిర్మించిన కాంట్రాక్టర్ కూడా హాజరుకాలేదు. ఈ వంతెన కోసం ప్రభుత్వం రూ.27కోట్ల 50 లక్షలు మంజూరు చేయగా కాంట్రాక్టర్‌కు రూ.21కోట్ల89 లక్షలు మాత్రమే చెల్లించినట్లు ఆయన చెబుతున్నాడు. కొన్ని పనులు చేయకుండానే కాంట్రాక్టర్ వదిలేశారని ఆర్అండ్‌బీ డీఈ గౌరీశ్వరావు తెలిపారు. వంతెనపైకి వెళ్లేముందు రోడ్డుకు ఇరువైపులా రివిట్‌మెంట్ వేయాల్సి ఉంది. ఈ పనులు చేయకుండా వదిలేయడంతో ఆ ప్రాంతంలో అపాయం పొంచి ఉంది. ఇదిలాఉండగా ఎ.సీతారాంపురంలో వెల్‌నెస్ సెంటర్, గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను కూడా పూర్తిచేయకుండానే ఇదేరోజు ఎంపీపీ సురేష్‌కుమార్ ప్రారంభించారు. వెల్‌నెస్ సెంటర్‌కు తలుపులే లేవు.

## నెల్లిమర్లలో ఆక్రమణలపై చర్యలు చేపట్టాలి

**నెల్లిమర్ల:** నెల్లిమర్ల గాంధీనగర్ కాలనీ, మండల పరిషత్ కార్యాలయ సమీ పంలోని జగనన్న కాలనీ ప్రాంతాల్లో పలువురు అధికార పార్టీకి చెందిన కౌన్సిల ర్లు, నాయకులు ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టి, అమ్మకాలు సాగిస్తున్నారని నగర పంచాయతీ 1వ వార్డు కౌన్సిలరు, టీడీపీ మహిళా విభా గం జిల్లా అధికార ప్రతినిధి కింతాడ కళావతి ఆరోపించారు. ఈమేరకు స్థానిక తహసీల్దార్ ధర్మరాజును గురువారం కలిసి ఫిర్యాదుచేశారు. ఈసందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మైనార్టీలకు కేటాయించిన శ్మశానవాటికకు వెళ్లే మార్గంలో అధికార పార్టీ నాయ కుడు ఆక్రమణ చేసి అమ్మకాలు సాగిస్తున్నారని ఆరోపించారు. జగనన్న కాలనీ సమీపంలో వైసీపీ కౌన్సిలర్ ప్రభుత్వ స్థలంలో షెడ్‌ని నిర్మించారని, వీటిని రెవెన్యూ అధికారులు తక్షణమే తొలగించాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఎన్నికల్లో సహకరించండి: అదితి

- ఎమ్మెల్యే అనుచరులు బెదిరించినా.. పెద్ద సంఖ్యలో హాజరైన టీచర్లు

**విజయనగరం (ఆంధ్రజ్యోతి):** ఎన్నికల్లో తమకు పూర్తి స్థాయి సహకారం అందించాలని టీడీపీ విజయనగరం అభ్యర్థి అదితి గజపతిరాజు ఉపాధ్యాయులను కోరారు. గురువారం రాత్రి ఉపాధ్యాయులతో ఆమె ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముందు బుధవారం రాత్రి ఉపాధ్యాయ సంఘ నాయకులతో అదితి సన్నాహక సమావేశం ఏర్పాటు చేశారు. దీనిపై ఉపాధ్యాయ సంఘ నాయకుడు ఒకరు ఎమ్మెల్యే కోలగట్ల అనుచరులకు ఉప్పందించారు. దీంతో ఎమ్మెల్యేకు ముఖ్య అనుచరుడుగా ఉన్న మరో రిటైర్డ్ ఉద్యోగి కార్యాచరణకు దిగా రు. టీడీపీ సన్నాహక సమావేశానికి వెళ్లవద్దని ఉపాధ్యాయ సంఘాల నాయ కులకు హెచ్చరికల ఫోన్లు వెళ్లాయి. ఈ ఫోన్ల విషయం ఉపాధ్యాయులకు తెలిసిం ది. దీంతో వారిలో మరింత కసి రేగింది. గురువారం రాత్రి ఆర్టీసీ కాంప్లెక్స్ పక్క నున్న మెసానిక్ టెంపుల్లో అదితి ఏర్పాటు చేసిన సమావేశానికి ఉప్పెనలా ఉపా ధ్యాయులు హాజరయ్యారు. టీడీపీకి అండగా ఉండాలని అదితి వారిని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం పెడుతున్న ఇబ్బందులను ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు వెల్లడించారు.

## సరైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి

**డెంకాడ:** మేరా పెహలా ఓట్ దేశ్ కెలియే ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ఎంవీజీఆర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్‌లో ప్రత్యేక చర్చ నిర్వహించారు. మొదటిసారి ఓటు వేయనున్నవారి కోసం ఏఐసీటీఈ మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కళాశాల డైరక్టర్ సీతారా మరాజు మాట్లాడారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ జీవిత భద్రతకు భరోసా కల్పించే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ ప్రసంగానికి కళాశాల సిబ్బంది మోహన్ కుమార్, ఎం.అనీల్ ప్రకాష్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

## ఆ ఉపాధ్యాయులను మార్చేయండి

**శృంగవరపుకోట రూరల్:** పల్లపుదుంగాడ ప్రభుత్వ పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయులను వేరేచోటుకు బదిలీ చేసి సరిగా బోధించే వారిని నియమించాలని గిరిజన సంఘ నేతలు కోరారు. గురువారం గ్రామంలో గిరిజన సంఘ ప్రతినిధులు గౌరీష్ తదితరులు మాట్లాడుతూ ఈ పాఠశాలకు సక్రమంగా ఉపాధ్యాయులు రాకుండా వలంటీర్‌తో నడపడం వల్ల వారు చదువుకు దూరం అవుతున్నార న్నారు. దీనిపై ఎంఈవో వివరణ కోరగా ఇద్దరు ఉపాధ్యాయులకు గాను ఒకరు సెలవు పెట్టారని.. మరో ఉపాధ్యాయురాలు ఆలస్యంగా వెళ్లారని తెలిపారు. గిరిజన సంఘం ఫిర్యాదుపై మరోసారి విచారణ నిర్వహిస్తామన్నారు.

## పేద మహిళల ఖాతాలో రూ.5 వేలు

**బొబ్బిలి:** కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను ఇంటింటికీ వెళ్లి వివరిస్తున్నారు. పీసీసీ అధికార ప్రతినిధి ముప్పల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యకర్తలు గురువారం ఐదో వార్డులో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కాంగ్రెస్ ను గెలిపిస్తే ప్రతి పేద కుటుంబ ఖాతాలో రూ.ఐదువేల చొప్పున జమ చేస్తారని హామీ ఇచ్చారు. రూ.500కే వంటగ్యాస్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం, రాష్ట్రానికి ప్రత్యేక హోదా అమలు చేస్తామని చెప్పారు.

## కొప్పలవెలమలకు సముచిత స్థానం కల్పించండి



బైకు ర్యాలీ నిర్వహిస్తున్న కొప్పలవెలమలు

**బొబ్బిలి:** ఉత్తరాంధ్రలో ప్రధానమైన సామాజి క వర్గాలలో ఒక్కటైన కొప్పలవెలమలకు రాజకీ యంగా సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం బొబ్బిలి పట్టణంలో ఆ సంఘం నాయకుల ఆధ్వర్యంలో బైకు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ప్రధాన వీధులలో నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. జనాభా దామాషా ప్రకారం విజయనగరం, అనకాపల్లి లోక్‌సభ స్థానాలలో పోటీకి అన్ని రాజకీయ పార్టీలు కొప్పలవెలమలకు అవకాశం కల్పించాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి సత్యనారాయణ, మరిశర్ల కృష్ణమూర్తినాయుడు, బి.తిరుపతి నాయుడు, మరిశర్ల అన్నంనాయుడు, మూడడ్ల సత్తిబాబు, గునుపూరు కృష్ణమూర్తి, తెర్లి కామినాయుడు, మరిశర్ల సింహాచలంనాయుడు, దారపురెడ్డి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

# శ్మశానవాటిక స్థలం కబ్జా



శ్మశానవాటిక స్థలంలో పాతిన సిమెంట్ స్తంభాలు

**మెంటాడ:** బడేవలస గ్రామంలో సుమారు రూ.60లక్షలు విలువచేసే శ్మశానవాటిక స్థలాన్ని స్థానిక వైసీపీ నేతలు ఆక్రమించడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై కలెక్టర్‌తో సహా స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదు. ఈ మేరకు గురువారం స్థానిక విలేకర్లు ఆక్రమ స్థలాన్ని పరిశీలించారు. వివరాలు ఇలా ఉన్నాయి. బడేవలసలో సర్వేనెం.46(28)లో ఉన్న 1.87 మరో సర్వే నెంబర్ 44(5)లో 0.33 మొత్తం 2.20 ఎకరాల స్థలాన్ని స్థానికులు పూర్వం నుంచి శ్మశానవాటికగా వాడుకుంటున్నారు. ఇటీవల గ్రామం నలువైపులా విస్తరించడంతో సదరు శ్మశానవాటిక గ్రామం మధ్యలో ఉన్నట్టయింది. గ్రామం మధ్యలో శ్మశానం మంచిది కాదని భావించిన స్థానికులు.. గ్రామానికి సమీపంలో ఉన్న వేరే స్థలాన్ని గుర్తించి అక్కడకు మార్చుకున్నారు. ఈ క్రమంలో పాత శ్మశానవాటిక ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. అంతే దానిపై స్థానిక ఉప సర్పంచ్ టి.రామునాయుడు బంధువులకు కన్ను పడింది. ఎలాగైనా దాన్ని వశం చేసుకోవాలని పలు విధాలా పావులు కదుపుతున్నారు. సుమారు 0.60 సెంట్లు భూమిని ఆక్రమించుకున్నారు. గడ్డి వాములు ఏర్పాటు చేసిన తమదని అనిపించుకున్నాడు. ఇందులో భాగంగానే ఆ స్థలంలో ఉన్న రెండు చెట్లు అక్రమంగా నరికివేసి ఆ స్థలంలోనే షెడ్ వేసుకునే పథక రచన చేశారు. దీనిపై వైసీపీకే చెందిన ఆ గ్రామ సర్పంచ్ మీసాల పార్వతి, స్థానికులు వీఆర్వో, తహసీల్దార్, కలెక్టర్‌కు ఫిర్యాదులు చేశారు. నివేదిక పంపాలని కలెక్టర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చినా అధికారులు పెద్దగా స్పందించిలేదన్న విమర్శలు ఉన్నాయి. తాజాగా ఆ స్థలంలో సిమెంట్ పక్కా షెడ్ ఏర్పాటు కోసం సిమెంట్ దిమ్మలు నిర్మిసు న్నారన్న సమాచారంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఫిర్యాదుపై వెంటనే చర్యలు చేపట్టివుంటే ఇంతవరకు వచ్చేదికాదని అభిప్రాయ పడుతున్నారు. ఉప సర్పంచ్ ఆక్రమించిన 60 సెంట్ల విలువ సుమారు రూ.60లక్షలు ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ● ఈ విషయంపై స్థానిక వీఆర్వో దుర్గ వద్ద ప్రస్తావించగా, ఉన్నతాధికారుల సూచనలు మేరకు నడుచుకుంటామని తెలిపారు. కలెక్టర్ గ్రీవెన్స్‌కు వెళ్లిన ఫిర్యాదుపై నివేదిక త్వరలో అందజేస్తామని చెప్పారు. ● ఈసందర్భంగా సర్పంచ్ మీసాల పార్వతి విలేకరులతో మాట్లాడుతూ రుద్రభూమి ఆక్రమణపై వీఆర్వో, తహసీల్దార్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. ఎటువంటి చర్యలు తీసుకోకుండా ఆక్రమణదారునికి కొమ్ము కాస్తున్నారని ఆమె విమర్శించారు.

## క్లుప్తంగా..

### చేయూత చెక్కుల పంపిణీ

**నెల్లిమర్ల:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురు వారం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు చేతులమీదుగా లబ్ధిదారులకు చేయూత చె క్కులను పంపిణీ చేశారు. ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జడ్పీటీసీ సన్యాసినాయుడు, నాయకులు పాల్గొన్నారు.

### కార్ల్‌మార్క్స్‌కు నివాళి

**నెల్లిమర్ల:** నెల్లిమర్ల అమర వీరుల స్మారక భవనంలో సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు ఆధ్వర్యం లో గురువారం కార్ల్‌మార్క్స్ వర్ధంతి నిర్వహిం చారు. ఈ సందర్భంగా మార్క్స్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకుడు కాళ్ల అప్పలసూరి, లెంక రామ్మూర్తి, గిడిజాల సన్యాసిరావు పాల్గొన్నారు.

### 'ఈబీసీ నేస్తం' విడుదల

**కలెక్టరేట్:** జిల్లాలోని ఈబీసీ నేస్తం కింద 5,546 మం దికి రూ.831.90 లక్షలు విడుదల చేసినట్టు కలెక్టర్ నాగ లక్ష్మి విడుదల చేసినట్లు తెలిపారు. గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి సీఎం జగన్ బటన్ నొక్కి విడు దల చేశారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసిన అనంతరం కలెక్టర్ లబ్ధిదారులకు ఈ చెక్కును అందజేశారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా



మాట్లాడుతున్న కేఏ నాయుడు

**గంట్యాడ:** గత 20 రోజులుగా తమకు అండగా ఉన్న టీడీపీ కార్యకర్తలందరికీ మాజీ ఎమ్మెల్యే కేఏ నాయుడు అభినందనలు తెలిపారు. గురువారం గంట్యాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో టీడీపీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మండల స్థాయి నాయకులు తమ అభిప్రాయం తెలియజేశారు. ఈసందర్భంగా కేఏ నాయుడు మాట్లాడుతూ గత 20 రోజులుగా తన కోసం, పార్టీ కోసం అంకితభావంతో పనిచేయడం చాలా అభినందనీయం అన్నారు. తాను కూడా ప్రతిఒక్కరికీ అండగా ఉంటానని చెప్పారు. తమ అభిప్రాయాన్ని పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకు వెళ్లానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండపల్లి భాస్కర్‌నాయు డు, అల్లు విజయకుమార్, రొంగళి కృష్ణ, బూడి అప్పలనాయుడు, రంధి చినరామునాయుడు, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల పోరాటానికి సంఘీభావం




భోగాపురం: నిరసన తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు



గరివిడిలో..

**భోగాపురం:** ఢిల్లీలో రామ్‌లీలా మైదానంలో రైతులు చేస్తున్న పోరాటానికి మద్దతుగా గురువారం స్థానిక బ్రిడ్జి సెంటర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వ హించారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకుడు బి.సూర్య నారాయణ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వి.రమణ పాల్గొన్నారు. ● **గరివిడి:** ఢిల్లీలోని రామలీల మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు సీఐటీయూ గరివి డి మండల శాఖ సంఘీభావం తెలుపుతూ గురువారం స్థాని క తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించింది. రైతుల సమస్యలు పరిష్కరించాలని నిరసనకారులు నిన దించారు. సీఐటీయూ గరివిడి మండల శాఖ కార్యదర్శి అంబళ్ల గౌరినాయుడు, ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం గరివిడి డీటీకి వినతిపత్రం అందించారు.

## టెన్త్‌లో తెలుగు బదులు హిందీ పేపర్

- నామినల్ రోల్స్ పరిశీలనలో గుర్తింపు

**వంగర:** ఈనెల 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న సంగతి తెలిసిందే. అన్ని కేంద్రాల సిబ్బంది గురువారం కేంద్రాలకు చేరుకొని నామినల్ రోల్స్, ఇన్విజిలేటర్ల వివరాలు నమోదు చేసుకున్నారు. మడ్డువ లస గురుకులం విద్యార్థిని పూడివలస చుడామణి మొదటి రోజు తెలుగు పరీక్ష రాయాల్సి ఉంది. కానీ ఆ విద్యార్థిని హిందీ పేపర్ రాయవలసి ఉందని నామినల్ రోల్‌లో నమోదుచేసి ఉంది. ఇది గమనించిన డీవో రమణమ్మ ఆరా తీయగా... ఆ విద్యార్థిని తెలుగు పరీక్ష రాయవలసి ఉందని తేలింది. దీంతో ఆమె ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విద్యార్థి పేరు నమోదు చేస్తూ పరీక్ష పేపర్ అందజేస్తారు. కాస్త ముందుగా విషయం తెలియడంతో సరిపోయిందని.. లేదం టే ఆ విద్యార్థిని భవిష్యత్తుపై ప్రభావం పడేదని స్థానికులు అంటున్నారు. ఈ విషయమై డీవో రమణమ్మ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా సమస్యపై ఉన్నతాధికా రులకు నివేదించానని తెలిపారు.

## గంట్యాడ హెచ్‌డీటీగా నారాయణమూర్తి

**గంట్యాడ:** గంట్యాడ హెచ్‌డీటీగా ఏపీడీఎస్ఎస్ నారా యణమూర్తి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నెల్లిమర్ల సీఎస్‌డీటీగా పనిచేస్తూ డెప్యూటేషన్‌పై ఇక్కడకు వచ్చారు.

## గస్తీని ముమ్మరం చేయాలి

**విజయనగరం క్రైం:** ఎన్నిక లు సమీపిస్తున్న నేపథ్యంలో నిరం తరం గస్తీని ముమ్మరం చేయాలని జీఆర్‌పీ డీఎస్పీ బి.మోహన్‌రావు అన్నారు. గురువారం విజయనగ రం జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రైళ్లలో అక్ర మంగా తరలించే బంగారం, వెండి, నగదు, గంజాయిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవివర్మ సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం

**తెర్లాం:** ఏపీటీఎఫ్ మండల శాఖ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బొత్స తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి కోట గోపాలకృష్ణ నాయుడు, గౌరవ అధ్యక్షులుగా మెరు పుల మధుసూ దనరావు, అసోసియేట్ అధ్యక్షులుగా బి.నారాయణరావు, ఉపాధ్య క్షులుగా వి.వెంకటేశ్వరరావు, పెద్దింటి రామారావు, అదనపు కార్యదర్శిగా ఎ.రామినాయుడు, కార్యదర్శులుగా డి.సింహాచలం, కె.తవిటినాయుడు, కె.సత్యనారాయణల ను, జిల్లా కౌన్సిలర్లు_గా 10 మందిని ఎన్నుకున్నారు.